క్లుప్తంగా

వ్యాసరచన పోటీలు



జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అర్వపల్లి : ఈ నెల 14న జరిగే బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని శనివారం జాజిరెడ్డిగూడెం, అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో భారత రాజ్యాంగ రచన – అంబేద్కర్ కృషి అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. దిశ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో దిశ సంస్థ మండల కన్వీనర్ దడిపల్లి వెంకట్, హెచ్ఎంలు జిల్లా ప్రసాద్, కె. తబిత, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నాగారంలో గాయపడిన నారాయణను పరామర్శిస్తున్న కడియం రామచంద్రయ్య

నాగారం : నాగారం మండల కేంద్రానికి చెందిన కల్లుగీత కార్మికుడు బాలగాని నారాయణ ఇటీవల కల్లు గీసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బీజేపీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య శనివారం బాధితుడిని పరామర్శించి, రూ.5000ల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే నాగారం గ్రామానికి చెందిన బాలగాని జలేంద్ర ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5,000ల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మెడబోయిన యాదగిరి, చిల్లరబోయిన హన్మంతు, అనంతుల సోమేష్‌గౌడ్, వసంతకృష్ణ, బొబ్బిలి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

అర్వపల్లి : ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో ఎస్సీ నిరుద్యోగ యువతి, యువకులకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఫర్ నర్సెస్ ప్రాజెక్ట్ మేనేజర్ సీహెచ్. సైదులు తెలిపారు. శనివారం ఆయన అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఫార్మసీ అసిస్టెంట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సులకు 10వ తరగతి చదివిన వారు అర్హులవుతారని, వీరికి మూడు నెలల శిక్షణ ఉంటుందని తెలిపారు. అడ్వాన్స్‌డ్ డయాలసిస్ టెక్నీషియన్ కోర్సుకు ఇంటర్ మీడియట్ చదువుకున్నవారు అర్హులని, వీరికి 12 నెలలు శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ సమయంలో ఉచితంగా వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు నిరుద్యోగ యువతీ, యువకులు ఈనెల 15వ తేదీలోగా సూర్యాపేటలోని స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9848581100, 9059902355, 9963616463 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవాలు



స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

చివ్వెంల : మండల పరిధిలోని ఉంద్రుగొండ గ్రామ శివారులోని గిరిదుర్గంలో వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా శనివారం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితుడు శ్రీమాన్ ఆరుట్ల రవికుమార చార్యులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి మంత్రోచ్ఛరణతో కల్యాణం జరిపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

11న సర్వసభ్య సమావేశం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 11న అర్వపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కతురోజు ఉమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు విధిగా హాజరుకావాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీకి రాజీనామా

తిరుమలగిరి : వెలిశాల గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు పొన్న సమత–వెంకన్న కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. కార్యకర్తల అభిప్రాయం సేకరించి త్వరలో ఏ పార్టీలో చేరేది తెలియజేస్తానన్నారు.

ఊపందుకున్న ‘ఉపాధి’ పనులు

- ప్రతి రోజు 1,000మందికిపైగా కూలీలు హాజరు
- పని ప్రదేశాల్లో కనీస వసతులు కరువు



పస్తాలలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

నాగారం : మండలంలో ఉపాధి హామీ పనులు ఊపందుకుంటున్నాయి. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా 5,000 మందికిపైగా కూలీలు పనులకు వెళ్తుంటారు. ప్రస్తుతం రోజు 900 నుంచి 1000 మందికిపైగా కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఏప్రిల్ చివర్లో, మే నెల నుంచి ఈ సంఖ్య ఇంకా రోజుకు 5000 వరకు పెరిగే అవకాశం ఉందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. వేసవి నేపథ్యంలో ఉపాధి పనులను ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. తిరిగి సాయంత్రం 3గంటల నుంచి 6 గంటల వరకు చేసేందుకు కూలీలకు వెసులుబాటు కల్పించారు. మండలంలో 14 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 9,360 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఈ జాబ్‌కార్డుల పరిధిలో 22,558 మంది కూలీలు నమోదై ఉన్నారు. వీటిలో 5వేలకుపైగా యాక్టివ్‌కార్డుల ఉన్నాయి. అలాగే మండలంలో ప్రస్తుతం ఉపాధి హామీ పథకంలో భాగంగా కాలువలు, చెరువులు, కుంటల్లో పూడికతీత, ఫీడర్ చానల్స్, నర్సరీలు, ఇంకుడు గుంతలు, హరితహారం చెట్ల సంరక్షణ, మట్టి రహదారుల నిర్మాణం, శ్మశానవాటికలు, డంపింగ్‌యార్డులు, కంపోస్టు షెడ్ల నిర్మాణం తదితర పనులు జరుగుతున్నాయని ఈజీఎస్ అధికారులు పేర్కొన్నారు.

మౌలిక వసతులు లేక ఇబ్బందులు..

రోజు, రోజుకు ఎండల తీవ్రత పెరుగుతుండటంతో ఉపాధిహామీ పనులు చేసేచోట కనీస వసతులు లేకపోవడంతో ఉపాధి కూలీలు ఎండలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధి పనులు చేసే చోట నీడ కోసం గతంలో సమకూర్చిన టెంట్లు పనికి రాకుండా పోయాయి. మళ్లీ వాటి మంజూరుపై గత రెండేళ్లుగా ఎలాంటి స్పష్టత లేదు. పనిచేసే చోట నీడ లేకపోవడంతో ఉపాధి కూలీలు ఎండలకు కాస్తంత సేద తీరడానికి చెట్లను ఆశ్రయించాల్సి వస్తోంది. అలాగే గతంలో కూలీలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేకంగా ఒక కూలీని నియమించేవారు. ఈ విధానాన్ని తొలగించి ఒక్కో కూలీకి నీటి కోసం అదనంగా రూ.5 ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం తాగునీటి ప్రోత్సాహకం ఊసేలేదు. కూలీలకు పని చేసినందుకు మాత్రమే కూలీ చెల్లిస్తున్నారు. అలాగే పని ప్రదేశాల వద్ద మెడికల్ కిట్లు అందుబాటులో ఉండాలనే నిబంధనలు ఉన్నా ఎక్కడా కనిపించడం లేదు. ప్రభుత్వం ఉపాధి హామీ పని స్థలాల్లో మౌలిక వసతులను పూర్తిగా విస్మరించడంతో కూలీలు ఇబ్బందుల మధ్య పనులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్నాం



జాబ్‌కార్డు కలిగి ఉండి ఉపాధిహామీ పనికి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తున్నాం. ఉపాధి పనులు జరిగే చోట వసతుల కల్పనకు చర్యలు చేపట్టాం. గత ఏడాది మండలంలో 5 వేలకు పైగా కూలీలు పనులకు వచ్చారు. ప్రస్తుతం రోజుకు 850 మందికి పైగా పనులకు వస్తున్నారు. పని కోరిన వారికి 100 రోజుల పని కల్పిస్తాం.

– పి.రవి, ఏపీఓ, నాగారం

అబద్ధపు ప్రచారాలు చేస్తే తీవ్ర పరిణామాలు



మాట్లాడుతున్న పటేల్ రమేష్‌రెడ్డి

ఆత్మకూరు (ఎస్) : తనపై బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని మానుకోవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని నెమ్మికల్ వద్ద ఆయన మాట్లాడారు. 25 ఏళ్ల రాజకీయ జీవితంలో నిస్వార్థంగా ప్రజలకు సేవచేశానే తప్ప ఎలాంటి అవినీతికి పాల్పడలేదని అన్నారు. తనపై తప్పుడు ఆరోపణ చేయడం తగదు అన్నారు. ఇంజనీరింగ్ చేసి అమెరికా పోయే అవకాశం ఉన్నప్పటికీ పేదలకు సేవ చేయాలన్న ఆలోచనతో రాజకీయాల్లో కొనసాగుతున్నానని, ఎమ్మెల్యే అయ్యే అవకాశం దురదృష్టవశాత్తు రాకపోయినా నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గట్టు శ్రీనివాస్, గోదాల రంగారెడ్డి, నామ ప్రవీణ్, చిలుముల గోపాల్ రెడ్డి, పానుగంటి మల్లారెడ్డి, భిక్షం నాయక్, జానయ్య, నాగయ్య, వెంకన్న, ప్రవీణ్ రెడ్డి, అరవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న వైఎస్సార్‌టీపీ నాయకులు

అర్వపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఏపూరి సోమన్న విమర్శించారు. టీఎస్‌పీఎస్‌సీ పశ్నపత్రాల లీకేజీని నిరసిస్తూ వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడారు. పశ్నపత్రాల లీకేజీపై వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. నిరుద్యోగ సమస్యపై తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని అన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా జరుగుతున్న ఇసుక దందాను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతకుంట్ల పరమేష్, శంబయ్యనాయుడు, వెలుగు అంజయ్య, కొమ్ము ఉపేందర్, గాజుల సురేందర్, పి. ఉపేందర్, దిలీప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవత విలువలతో వ్యక్తిత్వ వికాసం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ శంకర్ నాయక్

సూర్యాపేట రూరల్ : మానవత విలువలే వ్యక్తిత్వ వికాసాన్ని తెలియజేస్తాయని స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శంకర్‌నాయక్ అన్నారు. మానవ సేవే మాధవ సేవ అనే అంశంపై ట్రస్ట్ ప్రతినిధి సుమలత సమక్షంలో పుట్టపర్తి సాయిబాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పై అంశంపై విద్యార్థులకు సామర్థ్య పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలన్నారు. సామాజిక అంశాలపై అవగాహన ఉన్నప్పుడే విద్యార్థులు పరిపూర్ణ వికాసవంతులుగా తయారవుతారని తెలిపారు. సమాజంలోని రుగ్మతులను తొలగించడానికి విద్య ఒక్కటే ఆయుధంగా పని చేస్తుందని అన్నారు. అనంతరం సామర్థ్య పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులతో పాటు మెమెంటో అందజేశారు. ప్రిన్సిపల్ శంకర్ నాయక్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సిబ్బంది చంద్రబాబు, కవిత తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తిరుమలగిరి : వేసవి కాలంలో దొంగతనాలు జరుగకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని తిరుమలగిరి ఎస్ఐ శివకుమార్ కోరారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేసవి సెలవుల్లో ఇంటి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు ఇళ్లలో విలువైన వస్తువులు పెట్టరాదని సూచించారు. నివాసాల ప్రాంతాల్లో రాత్రి వేళల్లో పెట్రోలింగ్ చేస్తామని తెలిపారు. బయటకు వెళ్లే సమయంలో వాట్సాప్ నంబర్ 8712686040కు తెలియజేయాలని కోరారు.

బలగం సినిమా ప్రదర్శన

చివ్వెంల : మండల పరిధిలోని ఐలాపురం గ్రామంలో శనివారం రాత్రి బలగం సినిమాను ప్రదర్శించారు. సర్పంచ్ బోడపట్ల సునీత శ్రీను ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ సినిమాను గ్రామస్తులు పెద్దసంఖ్యలో హాజరై వీక్షించారు.

తుంగతుర్తి అసెంబ్లీ టికెట్ స్థానికులకే ఇవ్వాలి



సమావేశమైన వివిధ పార్టీల నాయకులు

అర్వపల్లి : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి టికెట్‌ను అన్ని పార్టీలు స్థానికులకే కేటాయించాలని వివిధ పార్టీలు, సంఘాలు తీర్మానించాయి. శనివారం స్థానిక లక్ష్మీనర్సింహ మినీఫంక్షన్‌హాల్‌లో పూలే–అంబేద్కర్ ఆశయ పోరాట సమితి ఆధ్వర్యంలో ‘పరాయి పాలన వద్దు – ఇంటి పాలన ముద్దు’ అనే నినాదంతో సదస్సును నిర్వహించారు. పూలే–అంబేద్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ఇకనుంచి నియోజకవర్గ ప్రజలు స్థానికేతరులను దూరం పెట్టి, స్థానికులనే గెలిపించాలని కోరారు. ఈ సదస్సులో ఎంసీపీఐయూ కేంద్ర కమిటీ సభ్యుడు వరికుప్పల వెంకన్న, టీపీసీసీ సీనియర్ నాయకుడు అన్నెపర్తి జ్ఞానసుందర్, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, హైకోర్టు న్యాయవాది దందోలు తిరుపతి, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బుడిగె మల్లేష్‌యాదవ్, ప్రియాంక, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి నజీర్, బీసీపీ నాయకుడు నారబోయిన వెంకట్‌యాదవ్, బుద్దా సత్యనారాయణ, కూరం లింగయ్య, పంది ధనుంజయ్, వజ్జె చిన వీరయ్య, దాసరి శ్రీను, చెర్కుపల్లి లక్ష్మణ్, చెరుకు శైలేందర్, దడిపల్లి వెంకట్, గుండెబోయిన ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం, సీపీఐ నాయకుల నిరసన



మాట్లాడుతున్న నాయకులు

నూతనకల్ : తెలంగాణ రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలను అమలు పర్చని మోదీ గో బ్యాక్ అంటూ సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు కందాల శంకర్‌రెడ్డి, తొట్ల ప్రభాకర్‌గౌడ్‌లు మాట్లాడారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడానికి కుట్ర పన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు గజ్జల శ్రీనివాస్‌రెడ్డి, కందాల కృష్ణారెడ్డి, ఎర్ర ఉప్పల్‌రెడ్డి, బాణాల విజయ్‌రెడ్డి, జటంగి లింగయ్య, పులిసరి వెంకటముత్యం, భోనగిరి లింగయ్య, తొట్ల శేఖర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళాబృందం

ఆత్మకూరు (ఎస్) : ఆత్మకూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సైబర్ నేరాలపై పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్స్, మహిళల భద్రత, మానవ అక్రమ రవాణా, లింగ వివక్ష, 100 కాల్, సోషల్ మీడియా, ఓటీపీ ఫ్రాడ్స్, సైబర్ నేరాలు, టోల్ ఫ్రీ నంబర్ 1930, సెల్ ఫోన్ కారణంగా కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎస్ఐ యాదవ్ రెడ్డి, సూర్యాపేట షీ టీం ఏఎస్ఐ పాండు నాయక్, సిబ్బంది జఫార్, ఎల్లారెడ్డి, శివరాం, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి, కళాబృందం ఇన్‌చార్జ్ ఎల్లయ్య, గోపయ్య చారి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అర్వపల్లి : అర్వపల్లిలోని విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు మండల డిస్కం ఏఈ తవాస శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా అర్వపల్లితోపాటు మండల పరిధిలోని జాజిరెడ్డిగూడెం, కాసర్లపహాడ్, పర్సాయపల్లి, తుంగగూడెం, సీతారాంపురం, బొల్లంపల్లి, రామన్నగూడెం, కొత్తగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

పాఠశాలకు వాటర్ ప్లాంట్ బహూకరణ



పాఠశాలకు వాటర్‌ప్లాంట్ అందజేస్తున్న దాతలు

పెన్‌పహాడ్ : విద్యార్థులు దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రేరణకర్త, రిటైర్డు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు గుండా రమేష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ధర్మాపురం ప్రాథమికోన్నత పాఠశాలకు సుధాకర్ పీవీసీ ఆర్థిక సహకారంతో మంచినీటి ప్లాంట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు సహకరించిన సుధాకర్ పీవీసీ ఇండ్రస్టీస్ చైర్మన్ మీలా మహాదేవ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపగాని యాదగిరిగౌడ్, విశ్రాంత అసోసియేట్ ప్రొఫెసర్ పీవీ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు శ్రీధర్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాక్ సెంటర్ ఏర్పాటు హర్షణీయం



పాలాభిషేకం చేస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : ఇంజనీరింగ్ విద్యార్థులు, యువత తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు జిల్లా కేంద్రంలో న్యాక్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమని ఇంజనీరింగ్ విద్యార్థులు అన్నారు. సూర్యాపేటలో న్యాక్ సెంటర్‌ను ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ శనివారం వారు జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు భవన నిర్మాణ మెళకువల నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా సూర్యాపేటలోనే న్యాక్ సెంటర్ ఏర్పాటు చేయడం పట్ల మంత్రి జగదీశ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

భానుపురి : గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని కౌన్సిలర్ అనంతుల యాదగిరిగౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని 29వ వార్డులోని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పోషక వారోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సరిత, జ్యోతి, ఆయాలు సుల్తానా, విధెమ్మ , ఎస్‌కే. హలీమా, ఆర్‌పీలు పద్మావతి, రాణి, ఏఎస్ఎం కళ్యాణి, ఆశా వర్కర్ నాగలక్ష్మి, స్థానిక వార్డు మహిళలు, గర్భిణులు, బాలింతలు పిల్లలు పాల్గొన్నారు.

మహిళల కోసం ప్రత్యేక పొదుపు పథకం

తుంగతుర్తి : కేంద్ర ప్రభుత్వం ఆజాదీ కా అమృత మహోత్సవంలో భాగంగా రెండేళ్ల కాల పరిమితితో మహిళలు, బాలికల కోసం ప్రత్యేకంగా మహిళా సమ్మాన్ పొదుపు పథకాన్ని తీసుకొచ్చిందని జిల్లా సబ్ డివిజన్ తపాలాశాఖ అధికారి గొని సురేష్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2025 మార్చి వరకు కేంద్రం మహిళా సమ్మాన్ పొదుపు పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ పథకంలో డబ్బులు పొదుపు చేసుకున్న వారికి 7.5శాతం వడ్డీ లభిస్తుందని తెలిపారు. ఈ పథకంలో గరిష్ఠంగా రూ.2లక్షల వరకు డిపాజిట్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయనతో పాటు పోస్టల్ సిబ్బంది ఉన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల నిరసన దీక్ష



తిరుమలగిరి: మాట్లాడుతున్న రిటైర్డు ఉద్యోగులు

తిరుమలగిరి : ప్రభుత్వ పెన్షనర్ల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న సూర్యాపేట కలెక్టరేట్ వద్ద జరిగే నిరసన దీక్షను విజయవంతం చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల శాఖ అధ్యక్షుడు జి.సుదర్శన్‌రావు, కార్యదర్శి బి.నర్సయ్య కోరారు. శనివారం ఆ సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నగదు రహిత వైద్యం అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అందించాలని, పెండింగ్‌లో ఉన్న 3 డీఆర్‌లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా మొదటి తేదీనే పెన్షన్లు వేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ సెక్రటరీ మండడి పద్మారెడ్డి, రాములు, నర్సయ్య, వెంకట్‌రెడ్డి, కృష్ణమాచారి, జయపాల్‌రెడ్డి, వెంకటయ్య, దామోదరాచారి, రాంరెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరసన దీక్షను విజయంతం చేయాలి

భానుపురి : అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10వ తేదీన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టే నిరసన దీక్షను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు డి. శ్యాంసుందర్ రెడ్డి, సుధగాని నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పెన్షనర్లు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు (ఎస్) : ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో బీ లిస్టులో ఉన్న లబ్ధిదారులు సంబంధిత పత్రాలతో దరఖాస్తులను గ్రామ కార్యదర్శి, పశువైద్యాధికారికి సమర్పించాలని మండల పశువైద్యాధికారి వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత పత్రాలు సమర్పించిన లబ్ధిదారులు లబ్ధిదారుని వాటా రూ.43,750 కలెక్టర్ ఖాతాలో జమ చేసేందుకు అర్హులవుతారని తెలిపారు.

విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాగరాజు

చిలుకూరు : హైదరాబాద్‌లో ఈ నెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించబోయే 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొండా సైదయ్య, పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మోలుగూరి నాగరాజు కోరారు. శనివారం చిలుకూరులో జరిగిన ఆ పార్టీ ఎస్సీ సెల్ మండల ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు దొడ్డా సురేష్‌బాబు, మాజీ జెడ్పీటీసీ భట్టు శివాజీనాయక్, డీఎల్‌డీఏ డైరెక్టర్ కస్తూరి నర్సయ్య, నెల్లూరి నాగేశ్వరరావు, చెవుల నాగేశ్వరరావు, వీరబాబు, మురళీ, వెంకటేశ్వర్లు, కుటుంబరావు, వెంకటరమణ, రాజు, రమేష్, రవి పాల్గొన్నారు.

గ్రంథాలయంలో భోజన వసతి



భోజనం వడ్డిస్తున్న బీఎస్పీ నాయకులు

కోదాడ : కోదాడ శాఖా గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు బహుజన సమాజ్ పార్టీ ఎక్జిక్యూటివ్ మెంబర్ పిల్లుట్ల శ్రీనివాస్ ప్రతిరోజు మధ్యాహ్నం ఉచిత భోజనాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పరీక్షలు పూర్తయ్యేవరకు నిరుద్యోగులకు భోజన వసతి కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం గ్రంథాలయానికి స్టడీ చైర్స్, ప్యాడ్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంది తిరపతయ్య, కళ్యాణ్, నూకల గోపాలస్వామి, రవి, సోమయ్య, మహేష్, సైమన్, శ్రీహరి, బాలు, విజయ్, కిశోర్, బుద్ధయ్య, ప్రభు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం

సూర్యాపేట : సూర్యాపేటకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయు ప్రధాన పైపు లైన్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం పట్టణంలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. కావున పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

కోదాడలో ‘రన్ ఫర్ జీసస్’



రన్ ఫర్ జీసస్‌ను ప్రారంభిస్తున్న పాస్టర్ యేసయ్య

కోదాడఅర్బన్ : ఈస్టర్ పండుగ సందర్భంగా కోదాడ యునైటెడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోదాడలో శనివారం రన్ ఫర్ జీసస్ నిర్వహించారు. కార్యక్రమాన్ని నయానగర్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవ యేషయ్య స్థానిక రంగా థియేటర్ సెంటర్ నుంచి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పాస్టర్స్ శ్రావణ్‌కుమార్, జోసెఫ్, అబ్రహం, ప్రభుదాస్, పౌలుచారి సందర్‌రావు, రాజారావు, జోసఫ్‌రాజు, ఏసయ్య, శ్రీనివాస్‌గౌడ్, జగ్గునాయక్ పాల్గొన్నారు.

తండాలో తాగునీటి ఎద్దడి నివారణకు కృషి

మఠంపల్లి : కామంచికుంటతండా గ్రామపంచాయతీ పరిధిలోని బోడబండతండాలో తాగు నీటి ఎద్దడి నివారణకు కృషిచేస్తున్నట్లు ఎంపీటీసీ దారావత్ శౌరి నాయక్, మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ బానోతు బాబునాయక్ తెలిపారు. శనివారం బోడబండతండాలోని ముత్యాలమ్మ గుడి వద్ద ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంజూరు చేసిన నిధులతో చేపట్టిన తాగు నీటి బోరు డ్రిల్లింగ్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సైదునాయక్, వార్డు సభ్యులు పత్తూనాయక్‌కోటమ్మ తదితరులున్నారు.

ఇఫ్తార్ విందు

తుంగతుర్తి : మండల కేంద్రంలోని మసీదులో శనివారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా తుంగతుర్తికి చెందిన వెలుగురాజేష్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు మౌలాన అబ్దుల్ అహద్, బాబాషర్ఫోద్దీన్, ఎండీ రఫీక్, షేక్.కరీం, నజీర్, అబ్దుల్, సిద్ధిక్, హమీర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

మునగాల : హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా శనివారం మండలంలోని ఆకుపాములలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విలాకసకవి రామరాజు, వెంకటేశ్వర్లు, రామరాజు యాదవ్, జిల్లేపల్లి గోపి, పోలంపల్లి వీరబాబు, కేశగాని సీతయ్య, పోలంపల్లి వీరయ్య, తాళ్లపాక శ్రీను, సతీష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

నడిగూడెం : ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ అన్నారు. శనివారం నడిగూడెం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో మోదీ గో బ్యాక్ అంటూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఎస్‌కే.మస్తాన్, అనంతుల కృష్ణయ్య, మల్లేపల్లి కళ్యాణ్, నవీన్, వినోద్, అభిమన్యు, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.